క్లుప్తంగా

కోసిగి సీఐగా మంజునాథ్


బాధ్యతలు స్వీకరిస్తున్న బీపీ మంజునాథ్

కోసిగి: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బీపీ మంజునాథ్ శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఆదోని ట్రాఫిక్ సీఐగా పనిచేస్తూ బదిలీపై కోసిగికు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ప్రసాద్ కర్నూలు వీఆర్‌కు వెళ్లారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించి బదిలీపై వెళ్లిన సీఐ ప్రసాద్‌ను కౌతాళం, పెద్దకడబూరు ఎస్‌ఐలు నరేంద్ర కుమార్ రెడ్డి, మహేష్, పోలీస్ సిబ్బంది సన్మానించారు. అలాగే నూతన సీఐకు పుష్ప గుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు. కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు మండలాలల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించ కుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు ఆర్‌ఎంపీలతో సమావేశం

గోనెగండ్ల: స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శనివారం ఉదయం 10:30 గంటలకు మండలంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు గోనెగండ్ల పీహెచ్‌సీ డీడీఓ డాక్టర్ రవళి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీల దగ్గరకు రోగులు వస్తే ఎలాంటి వైద్య సేవలు అందించాలనే విషయాలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

పర్యావరణాన్ని కాపాడుదాం


మొక్కలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరురూరల్: మొక్కలను పెంచి పర్యావరణాన్ని రక్షించుకుందామని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పార్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 'శుభదిన్ భోజన్' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృక్షాలను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయన్నారు. మొక్కలు అంతరించటంతో పర్యావరణం హరించిపోయి కాలుష్యం పెరిగిపోవటం వలన గుర్తించలేని అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు సీఐగా బి.సుదర్శన్‌రెడ్డి



ఎమ్మిగనూరురూరల్: పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.సుదర్శన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ మధుసుదన్ రావు కర్నూల్ వీఆర్‌కు బదిలీ కావటంతో కర్నూల్ వీఆర్ నుంచి ఇక్కడికి సుదర్శన్ రెడ్డి బదిలీపై వచ్చారు. నూతన సీఐ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రజల సహకారంతో పట్టణలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. తాను 2004లో ఎస్‌ఐగా చేరి ఆత్మకూరు, సంజామల, మహనంది, రుద్రవరం, దేవనకొండ, ఆళ్లగడ్డ, శ్రీశైలం పోలీస్‌స్టేషన్లలో పనిచేసినట్లు చెప్పారు. సెంట్రల్ ఏసీబీ, శాంతి పరిరక్షణ దళం, సెబ్ సీసీలో విధులు నిర్వర్తించానన్నారు. అనంతరం టౌన్ ఎస్‌ఐ రమేష్‌బాబు, ఎస్‌బీ ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు, ఏఎస్‌ఐలు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రార్థన కేంద్రాలు మానవత్వానికి నిలయాలు


చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మహంతస్వామి, ప్రదీప్‌రెడ్డి

కౌతాళం: ప్రార్థన కేంద్రాలు మానవత్వానికి నిలయాలుగా నిలుస్తాయని హాల్వి మఠం స్వామి మహంతస్వామి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ప్రదీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గుడికంబాలి గ్రామంలో చర్చి ప్రారంభోత్సవారంలో వారు పాల్గొన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ అందరూ కలిసికట్టుగా సోదరభావంతో మెలగాలని అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మహంతస్వామి అన్నారు. పాస్టర్ రాజేంద్రబాబు, సర్పంచ్ సిద్దేశ్, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్ అవతారం తదితరులు పాల్గొన్నారు.

సహస్ర ఘటకాభిషేకం

ఆదోని అర్బన్: వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ పట్టణంలోని సంతపేటలో నాగలింగేశ్వరస్వామి, పేట వీరభద్రేశ్వరస్వామి వార్లకు శుక్రవారం సహస్ర ఘటకాభిషేకం నిర్వహించారు. అల్మారు మఠం నిర్వాహకుడు మహర్షి విజయ్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం చేశారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

● ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ


ఉరుకుందలో పర్యటిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ


గణేకల్‌లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న సబ్‌కలెక్టర్

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. శుక్రవారం ఆయన ఉరుకుందను సందర్శించి ఉత్సవాల పనులను పరిశీలించారు. ఈనెల 5 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్‌కు ఆదేశించారు. క్యూలైన్‌లు విశాలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, క్యూలైన్‌లలో తాగునీరు, బాత్‌రూం సౌకర్యం కల్పించాలని సూచించారు. స్వామి దర్శనానికి కనీసం రెండు గంటలు పడుతుందని, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఉరుకుందకు నాలుగు వైపులా వాహనాలు ఆపేందుకు పార్కింగ్ సౌకర్యం కోసం పొలాల యజమానులతో మాట్లాడాలని, అవసరమైతే పొలాలను అద్దెకు తీసుకుని ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డిని ఆదేశించారు. పార్కింగ్‌లో లైటింగ్‌తో పాటు సీసీ కెమెరాలు ఉండేలాన్నారు. బయటనే చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల రద్దీని నియంత్రించాలన్నారు. ఎప్పటికప్పడు పనులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

ఆదోని రూరల్: మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ హెచ్చరించారు. ఆదోని మండలం గణేకల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందడం లేదని శుక్రవారం పలు దినపత్రికల్లో వార్తా కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన సబ్ కలెక్టర్ శుక్రవారం గణేకల్ గ్రామాన్ని సందర్శించి సంబంధిత అధికారులతో సమీక్షించారు. వాటి కారణాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పౌర సరఫరాల వాహనం తనిఖీ

రేషన్‌కార్డుదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. గణేకల్ గ్రామంలో ఎండీయూ వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ కోసం వచ్చిన కార్డుదారులతో మాట్లాడారు. వాహనంలో ఉన్న స్టాక్‌ను మిషన్‌లో ఉన్న స్టాక్ వివరాలను పరిశీలించారు. డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ రుద్రగౌడ్, ఎంపీడీఓ విజయశేఖర్‌రావు ఉన్నారు.

ప్రభుత్వ విద్యార్థులకే తల్లికి వందనం అమలు చేయాలి


మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకుడు రమేష్ నాయుడు

ఆదోని సెంట్రల్: తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ విద్యార్థులకే వర్తింపజేయాలని ఎస్టీయూ నాయకుడు బి.రమేష్ నాయుడు కోరారు. శుక్రవారం ఎస్టీయూ భవనంలో ఆదోని రీజియన్ సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లే విద్యార్థులకు ఈ పథకం అమలు చేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఎస్టీయూ జిల్లా అసోసియేట్ ప్రసిడెంట్ నాగేంద్రప్ప, ఎస్టీయూ నాయకులు నాగప్రసాద్, శ్రీనివాసులు, కాశీ విశ్వనాథశాస్త్రి, నారాయణ, హనుమన్న, జ్యోతిమూర్తి, శ్రీనివాసులు, బసవరాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి


అంబేడ్కర్, మంద కృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కోసిగి: సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ప్రస్తుత నోటిఫికేషన్‌లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గప్ప మాదిగ, ఎమ్మార్పీఎస్ తాలుకా కన్వీనర్ నాగరాజు మాదిగ కోరారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో అంబేడ్కర్, మంద కృష్ణ మాదిగ చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సామెల్ మాదిగ, నరసింహులు, నాయకులు చిదానంద, లింగమూర్తి, లక్ష్మయ్య, రాజారాం, కొమ్ము రామన్న, విజయ్‌కుమార్, హనుమంతు, ఉరుకుందు, నరసయ్య పాల్గొన్నారు.

పోరాటాలతోనే ఎస్సీ వర్గీకరణ

ఎమ్మిగనూరుటౌన్: పోరాటాలతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్, నియోజకవర్గ అధ్యక్షుడు సుమాల చార్లెస్ పేర్కొన్నారు.ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పునివ్వడంతో శుక్రవారం పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే.. సుప్రీం తీర్పు హర్షనీయమని జైభీం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

'సుప్రీం' తీర్పుపై సంబరాలు

పెద్దకడబూరు: మాదిగల మూడు దశాబ్దాల చిరకాల కోరిక ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గుమ్మల లక్ష్మన్న, జంబన్న, శాంతిరాజు, బొగ్గుల తిక్కన్న తదితరులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఎస్సీ కాలనీ నుంచి ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ పోరాటయోధుడు మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల ఉద్యమ ఫలితంగానే తమకు ఈ అవకాశం దక్కిందని కొనియాడారు. సహకరించిన ఎన్డీఏ ప్రభుత్వానికి మాదిగలంతా రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు బొగ్గుల నరసన్న, పెసలబండ రామన్న పాల్గొన్నారు.

స్థాయిని మరిచి మాట్లాడితే ఊరుకోం


వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ టౌన్ కార్యదర్శి నారాయణ

ఆదోని రూరల్: ఆదోని టీడీపీ నాయకుడు ఉమ్మి సలీమ్ తన స్థాయిని మరిచి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని విమర్శిస్తున్నారని.. మరోసారి అలా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ టౌన్ కార్యదర్శి పరిగల నారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి సాయిప్రసాద్‌రెడ్డి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం


హెచ్.మురవణిలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు

పెద్దకడబూరు: తల్లిపాలు బిడ్డలకు ఎంతో శ్రేష్టమని ఏఎన్‌ఎంలు భారతి, లోకేశ్వరి సూచించారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలన్నారు. అప్పుడే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఎదుగుదలకు దోహద పడుతుందన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనిత, శారద, ఆయాలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం


కషాయం పిచికారీ చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: ప్రకృతి వ్యవసాయంతో రైతులు నిరంతర ఆదాయాన్ని పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం డివిజన్ ఇన్‌చార్జ్ రేవన్న సూచించారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో రైతు యల్లప్ప పొలంలో మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం ద్వారా ఏటీఎం మోడల్ ముల్లంగి, బీట్‌రూట్, క్యారెట్ పంటలను సాగుచేస్తూ ఆదాయాన్ని పొందుతున్నాడు. యల్లప్ప సాగుచేసుకుంటున్న పంటలను వారు శుక్రవారం సందర్శించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగుచేసుకుంటే 30 రోజుల నుంచే ఆదాయాన్ని పొందవచ్చన్నారు. పంటలకు ఆశించిన పురుగు నివారణకు నీమాస్త్రం, దశపర్ణి కషాయాలను పిచికారీ చేయాలన్నారు. ఈ విధానం ద్వారా భూమిలో జీవ వైవిధ్యం పెరిగి నేల సారవంతమవుతుందన్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు పొంది ఆరోగ్యవంతమైన కూరగాయలను అందించవచ్చన్నారు. ప్రతిఒక్క రైతు ఈ విధానాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం మండల సిబ్బంది శ్రీశైలం, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి

ఆదోని టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారిణి గాయత్రి సూచించారు. శుక్రవారం ఆదోని పట్టణం బావాజీపేటలోని 2వ వార్డులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమకాటుకు గురికాకుండా ప్రజలు రాత్రి వేళల్లో దోమతెరలను వాడాలన్నారు. ఎక్కువ రోజుల పాటు ఇళ్లల్లో, ఇంటి ముందు నీటిని నిల్వ ఉంచుకోరాదని తెలిపారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం, దగ్గు వస్తే ప్రభుత్వ ఆస్పత్రులో చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఏవీ సురేష్, నూకరాజు, మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోండి


మాట్లాడుతున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ

గోనెగండ్ల: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పకుండా ఈ- క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత తెలిపారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతు సేవా కేంద్రాల సహాయకులకు బి.అగ్రహారం రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్ మల్లికార్జున ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదుతో ప్రభుత్వం నుంచి అన్ని పథకాలు అన్నదాతలకు అందుతాయన్నారు. రైతులు కూడా తమ పొలాల్లో సాగుచేసిన పంటలను రైతు సేవా కేంద్రాల్లోని సహాయకులను కలిసి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

కోసిగి: వర్షకాలం కావడంతో గ్రామంలో దోమలు వ్యాప్తి చెందకుండా బయో ఫ్లెక్స్ మస్కిటో యాంటీ లార్వా లిక్విడ్ పిచికారీ చేసినట్లు పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం మేజర్ పంచాయతీ కోసిగిలో సర్పంచ్ కుమారి అయ్యమ్మ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి, రైల్వే గేటు కాలనీ, 1వ వార్డు, రామక్కమ్మ కాలనీలో పంచాయతీ సిబ్బందితో ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల ముందులు డ్రయినేజీ కాల్వలలో చెత్తా చెదారం వేయకుండా , మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. రెండు రోజుల పాటు గ్రామంలో అన్నీ కాలనీల్లో స్ప్రే చేయిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు తాగునీటి కాచి వడబోసిన నీటి తాగాలన్నారు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా ప్రతి వార్డులో ఎప్పటికప్పుడు శుభ్రం చేయించేలా చూస్తామన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడికి యత్నం

ఆదోని సెంట్రల్: పురపాలక పరిధిలో ఉన్న ఓ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిపై ఉపాధ్యాయుడు దాడికి యత్నించాడు. ఈ విషయం ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఒక ఉపాధ్యాయురాలి సర్వీస్ రిజిస్టర్ డేటా ఎంట్రీ విషయంలో ప్రధానోపాధ్యాయుడితో ఉపాధ్యాయుడు వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ప్రధానోపాధ్యాయుడిపై ఉపాధ్యాయుడు దాడికి యత్నించాడు. పక్కనే ఉన్న ఉపాధ్యాయుడు అడ్డుకున్నాడు. ఇంతలోనే తరగతి గదుల్లో ఉన్న ఉపాధ్యాయులు, పక్కన ఉన్న పాఠశాల ఉపాధ్యాయులు అక్కడికి చేరుకున్నారు. జరిగిన ఘటనపై చర్చించి.. ఉపాధ్యాయుడితో ప్రధానోపాధ్యాయుడికి క్షమాపణ చెప్పించారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఇళ్ల నుంచి సేకరించే తడి,పొడి చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించొద్దని మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డి కార్మికులకు సూచించారు. శుక్రవారం స్థానిక ట్యాంక్‌బండ్ రోడ్డు,సోమేశ్వర టాకీస్ సర్కిల్ ప్రాంతాల్లో చెత్త సేకరణను పరిశీలించి పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: పట్టణంలోని కల్లుబావి 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మాధవరం రోడ్డు, ఎమ్మిగనూరు రోడ్డు, ఆస్పరి రోడ్డు, ఎస్కేడీ కాలనీ, ఎన్‌జీవోస్ కాలనీ, టీజీఎల్ కాలనీ, ఎల్‌బీ స్ట్రీట్, బోయగేరి, వాల్మీకినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలన్నారు.

ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని సెంట్రల్: పేదరికం, వ్యక్తిగత కారణాలతో మధ్యలో చదువు ఆపేసిన వారికి సార్వత్రిక విద్యా పీఠం ఓపన్ స్కూల్(అపాస్) ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియెట్ చదువుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్స్ మల్లికార్జున ఫయాజుద్దీన్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆగస్టు 27వ తేదీలోగా అపాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు రూ.200 అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతుడు వీరేష్

గుత్తి రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా ఆదోని మండలం పెద్దతుంబలం గ్రామానికి చెందిన కురుబ వీరేష్ (30) సెంట్రింగ్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. పామిడిలోని భార్య రేణుకమ్మ బంధువులతో కలిసి భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం వ్యక్తిగత పనిపై పెద్దతుంబలం వెళ్లిన ఆయన శుక్రవారం ఉదయం పామిడికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. గుత్తి సమీపంలోని టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. అటుగా వెళుతున్న వారు గమనించి సమాచారం ఇవ్వడంతో హైవే అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వీరేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'కూటమి' సిగపట్టు!

–సీఐ పోస్టింగ్‌పై రగడ

ఆదోని అర్బన్: ఆదోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కువ శాతం బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా, గుట్కా, అక్రమ మద్యం తరలింపు, సారా తయారీ తదితర అసాంఘిక కార్యకలాపాలు అధికంగా ఉండేవి. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో చాలావరకు అడ్డుకట్ట పడింది. తాజాగా టీడీపీ ప్రభుత్వం రావడంతో అసాంఘిక కార్యకలాపాల నిర్వాహకుల్లో ఓ వర్గం కార్యకర్తల్లో ఆశలు చిగురించాయి. అయితే ఆదోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా సీఐ శ్రీరామ్ వస్తున్నట్లు తెలుసుకున్న కూటమిలోని ఓ వర్గం అడ్డుకుంటోంది. ఎలాగైనా సీఐ రాకుండా చేయాలని, గ్రూపులుగా తయారై కూటమిలో ఓ నాయకుడితో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. గతంలో సీఐ శ్రీరామ్ ఆదోని పట్టణ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసి బదిలీ అయ్యారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సీఐని ఇక్కడికి రాకుండా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మధ్య తీవ్రస్థాయిలో మనస్పర్థలు ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావొస్తున్నా టీడీపీ నాయకులు ఏ పని చేసినా దానికి కూటమిలో ఓ వర్గం అడ్డుపడుతున్నట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే ఆదోని వన్‌టౌన్‌కు పట్టుబట్టి మరీ పోస్టింగ్ ఇప్పిస్తున్నట్లు సమాచారం. దీంతో ఒక వర్గానికి ఈ సీఐ వస్తే కష్టతరమని, ఎలాగైనా ఆదోనికి రాకుండా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పింగళి వెంకయ్య జయంతి


పెద్దమరివీడులో వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

గోనెగండ్ల: మండలంలోని పెద్దమరివీడు ఎంపీయూపీ పాఠశాలలో హెచ్‌ఎం వి.రామలింగం ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య 149వ జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పింగళి వెంకయ్య 19 ఏళ్ల వయస్సులో బ్రిటీష్ సైన్యంలో చేరి దక్షిణ ఆఫ్రికాలో జరుగుతున్న బోయర్ యుద్ధంలో పాల్గొన్నారని తెలిపారు. అక్కడ గాంధీతో సాన్నిహిత్యంగా మెలిగి స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొన్నారని వివరించారు. స్వాతంత్ర్యం లభించిన తర్వాత ఖనిజ పరిశోధన శాఖలో సలహాదారుడిగా పనిచేశాడని వివరించారు. ఉపాధ్యాయులు నరసప్ప, నాగేశ్వర రావు, పురుషోత్తం, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న రామాంజనేయులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆలూరు రహదారి కల్లుబావి వద్ద శుక్రవారం రాత్రి బొలెరో వాహనం ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. కల్లుబావికి చెందిన రామాంజనేయులు రోడ్డు పక్కనున్న హోటల్‌లో ఎగ్ రైస్ తేవడానికి వెళుతుండగా ఆలూరు వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. తల, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని బంధువులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి


మురుగు గుంతలో దోమల నివారణ మందు వేస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సచివాలయం-4 పరిధిలో వైద్య సిబ్బంది ఫ్రైడే- డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇళ్లల్లో ఉన్న గచ్చులు, డ్రమ్ములను పరిశీలించి నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. అలాగే.. ఆయా ప్రాంతాల్లో నిల్వ ఉన్న మురుగు నీటిపై దోమల నివారణ మందు చల్లించారు. ఆయన మాట్లాడుతూ గచ్చులు, డ్రమ్ములపై మూతలు ఏర్పటు చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ హనుమంతు, ఏఎన్‌ఎం రాజమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్

గోనెగండ్ల: మండల కేంద్రంలో బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్ కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ సమావేశం నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కార్యర్శి నరసింహ, మాజీ నాయకుడు ఖాజాతో కలిసి ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో విద్యార్థులు చదువుకోవడానికి సరైన సౌకర్యాలు లేక వలస వెళ్తున్నారని, వాటిని నివారించాలంటే..బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మండలంలోని గ్రామాలకు సరైన బస్సు సౌకర్యం లేక పోవడంతో ఉన్న విద్యార్థులు విద్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పవన్ తేజ, కార్యదర్శిగా రంగస్వామి, నాయకులుగా అన్నమయ్య, హుసేని, వినయ్, రియాజ్, నరేంద్ర, అరవింద, ఓంకార్ మరో పదిమందిని ఎన్నుకున్నారు.